'నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని వినతి



డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ శాసనసభ్యుడు రామచంద్రునాయక్ గురువారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఇటీవల వరదలకు నియోజకవర్గంలో అపార నష్టం వాటిల్లిందని పూర్వ స్థితికి తీసుకురావడానికి చేయూత అందించాలని కోరారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థ మంజూరు చేయాలని విన్నవించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉన్నారు

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక



వేదవ్యాస్‌తో డీఎస్వో అప్పారావు, అధ్యాపకులు

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో కురవి మండలం మోదుగులగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వేదవ్యాస్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు. ద్వితీయ స్థానం సావిత్రి, జడ్పీహెచ్‌ఎస్ పొనుగోడు, తృతీయ స్థానం సుష్మ కుమారి, ఏకశిల ఏంజెల్స్ పాఠశాల, నాలుగో స్థానం జ్యోత్స్న, జడ్పీహెచ్‌ఎస్, దంతాలపల్లి సాధించారు. కార్యక్రమంలో డీఈఓ రాజేశ్వర్, డీఎస్వో అప్పారావు, ఏకశిల ఏంజెల్స్ ప్రిన్సిపల్ రమేశ్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ ప్రణాళిక సమన్వయకర్త పూర్ణచందర్, మహేశ్, విజయరాజ్, పోటీ న్యాయనిర్ణేతలు ఫార్మసీ కళాశాల అధ్యాపకులు నాగమణి, అర్చన పాల్గొన్నారు.

జిల్లాలో 21 గ్రూప్-3 పరీక్ష కేంద్రాలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: వచ్చే నెలలో నిర్వహించనున్న గ్రూపు-3 పరీక్షలకు జిల్లాలో 21 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పాలనాధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన దూరదృశ్య సమీక్షా సమావేశానికి మానుకోట నుంచి ఆయన హాజరయ్యారు నవంబరు 17, 18వ తేదీల్లో నిర్వహించే పరీక్షలకు మహబూబాబాద్‌లో 13, తొర్రూరులో 8 కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నరసింహారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బలరాంనాయక్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్ జైలులో సౌకర్యాలపై ఆరా

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ జైలును శుక్రవారం తెలంగాణ జైళ్ల శాఖ డీఐజీ మాదారపు సంపత్ కుమార్ సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చిన ఆయనకు వరంగల్ సబ్ జైళ్ల అధికారి విజయ్ డేవిడ్ స్వాగతం పలికారు. జైలు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జైలులోని అన్ని ప్రాంతాలను పరిశీలించి ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు, జైళ్లో అమలు చేస్తున్న పద్ధతులను సబ్ జైలర్ మల్లెల శ్రీనివాసరావు డీఐజీకి వివరించారు. జైళ్లో పరిశుభ్రత, పచ్చటి వాతావరణం, ఖైదీల సంక్షేమంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు అధికారులు డీఐజీని సన్మానించారు. జైలు అధికారులు భిక్షపతి, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



జైళ్ల శాఖ డీఐజీ సంపత్ కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

మార్పు కోసం.. మన పాలనాధికారులు



వినూత్న ఆలోచనలతో ముందడుగు

ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో పాలనాధికారులు వినూత్న కార్యక్రమాలతో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.. ప్రజల హృదయాలను గెలుచుకుంటున్నారు. పాలనలో తమదైన ప్రత్యేక ముద్ర వేస్తూ కీలకమైన విద్య, వైద్య రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ములుగు, జనగామ, వరంగల్ పాలనాధికారులు రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.



దుగ్గొండి బాలుర వసతిగృహంలో ఫిర్యాదుల పెట్టెను తెరుస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఉన్నతిలో 'కీ'రోల్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, కస్తూర్బా విద్యాలయాలు, గురుకులాల్లోని విద్యార్థుల ఉన్నతిపై **వరంగల్ పాలనాధికారి డా.సత్యశారద** దృష్టి సారించారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు వసతిగృహాలు, గురుకులాల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటుచేశారు. వాటి తాళాలు ఆమె వద్దే ఉంటాయి. విద్యార్థులు తమ సమస్యలను చీటీల్లో రాసి పెట్టెలో వేస్తున్నారు. ఎవరు ఫిర్యాదు చేశారో వార్డెన్, ఇతర సిబ్బందికి తెలియనీయకుండా.. విద్యార్థుల డార్మెంటరీలలోనే వాటిని ఏర్పాటుచేశారు. ఆకస్మిక తనిఖీల సమయంలో పాలనాధికారి పెట్టెలను తెరిచి సమస్యలు తెలుసుకుంటున్నారు. పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. దాంతో వసతిగృహాలు, గురుకులాల సిబ్బంది విద్యార్థులకు అందించే భోజనాలు, శుభ్రతపై అప్రమత్తంగా ఉంటున్నారు. ● ఫిర్యాదుల పెట్టె ద్వారా విద్యార్థులు కోరినట్లు నవంబరు 15 లోగా దుప్పట్లు పంపిణీ చేస్తామని పాలనాధికారి తెలిపారు.

–వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే



ఆసుపత్రిలో రిజిస్టర్ పరిశీలిస్తూ..



ప్రతి సమస్య నమోదుకు ప్రత్యేక పుస్తకం

హనుమకొండ పాలనాధికారి ప్రావిణ్య వినూత్నంగా ఆలోచించి ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) బుక్ ఏర్పాటు చేశారు. ఎవరైనా కలెక్టర్‌కు నేరుగా దరఖాస్తు ఇచ్చినా, తాను క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న సమస్యలేమిటో ఆరా తీస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు ఏం చేయాలి.. తన పరిధిలో చేయొచ్చా.. పై అధికారులతో మాట్లాడాల్సి వస్తుందా... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా.. ఇలా ప్రతి పనికి సంబంధించి పూర్తి వివరాలతో కలెక్టరేట్‌లో ఏటీఆర్ బుక్‌లో నమోదు చేసి ఆన్ లైన్ చేయిస్తున్నారు. ప్రతి శనివారం సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. ఫలితంగా ఆయా పనులు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. ● ఏటీఆర్‌లో నమోదైన సమస్యలపై సమీక్షిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాని పాలనాధికారి ప్రావిణ్య పేర్కొన్నారు. –న్యూస్‌టుడే, హనుమకొండ కలెక్టరేట్

వాట్సప్ హాజరు గ్రూపులతో గైర్హాజరుకు ముకుతాడు

ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావడం లేదని **జనగామ పాలనాధికారి రిజ్వాన్ బాషా** ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. దీంతో ఆయన తనతో పాటు డీఎంహెచ్‌ఓ, ఇతర వైద్యాధికారులు, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, అన్ని విభాగాల సిబ్బందితో ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ సీహెచ్‌సీల్లో ప్రతి రోజూ విధులకు హాజరయ్యే వైద్య, సిబ్బంది విధుల్లోకి వచ్చిన, వెళ్తున్న సమయంలో ఆ గ్రూప్‌లో ఫొటో పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు. ఆ రోజు ఎంత మందికి ఓపీ చూశారు, ఎంత మంది ఇన్‌పేషెంట్లకు వైద్యం చేశారనే వివరాలను పొందుపరుస్తున్నారు. ఈ గ్రూప్‌ను డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ పర్యవేక్షిస్తుంటారు. పాలనాధికారి కూడా ప్రతి రోజూ పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తూ తన అభిప్రాయాలను పోస్టు చేస్తున్నారు. పాలనాధికారే గ్రూప్‌లో ఉంటూ గమనిస్తుండటంతో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య, సిబ్బంది మెరుగైన హాజరు కనిపిస్తోంది.





విధుల్లో ఉన్నామంటూ వాట్సప్ గ్రూపులో వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది


పాఠశాలల్లో సైతం: జులైలో 600 మంది ఉపాధ్యాయులు సెలవులు పెట్టారని తెలుసుకున్న పాలనాధికారి విద్యాశాఖలోనూ ప్రక్షాళన ప్రారంభించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయించారు. రోజూ హాజరు శాతం పోస్టు చేసేలా చర్యలు చేపట్టారు.

● రాష్ట్రంలో జనగామను ఆదర్శ జిల్లాగా ముందు వరుసలో ఉంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పాలనాధికారి రిజ్వాన్ బాషా తెలిపారు.

–న్యూస్‌టుడే, జనగామ టౌన్

కంటెయినర్ ఆసుపత్రితో చేరువైన వైద్యం, విద్య

ములుగు జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల ప్రజలు సరైన రహదారి లేక అవస్థలు పడుతుంటారు. వర్షాకాలం విద్య, వైద్యం అందని పరిస్థితులు. **ములుగు పాలనాధికారిగా టీఎస్ దివాకర** జూన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంత్రి సీతక్క ఇక్కడి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని ఆయన్ను కోరారు. ఆయన జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి కంటెయినర్ ఆసుపత్రి ఆలోచనను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనలతో తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలో కంటెయినర్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్(కంటెయినర్ ఆసుపత్రి) ఏర్పాటు చేయించారు. నర్సాపూర్, అల్లిగూడెం, బందాల, బొల్లెపల్లి గ్రామాలకు కూడా దీని ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. వాజేడు మండలం ఎడ్లర్లపల్లిలోనూ ఏర్పాటు చేయించారు. రూ.7 లక్షలు వెచ్చించి తయారు చేయించారు. ఇందులో నాలుగు పడకలు ఉంటాయి. ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, హెల్త్ అసిస్టెంటు వైద్య సేవలందిస్తున్నారు.





కంటెయినర్ బడిలో చదువుకుంటున్న విద్యార్థులు

ఇదే స్ఫూర్తితో పాఠశాల..: కన్నాయిగూడెం మండలం బంగారుపల్లి గొత్తికోయ గూడెంలో రూ.13 లక్షలతో పాఠశాల కోసం కంటెయినర్‌ను ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్తు, డ్యూయెల్ డెస్కులు, ఫ్యాన్లు, నల్లబోర్డు, తదితర వసతులున్నాయి.

● రవాణా సౌకర్యం లేని గ్రామాల్లో సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని పాలనాధికారి దివాకర తెలిపారు.

–ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి

ఖాళీల భారం.. సేవలు దూరం..!

జిల్లాలో బాల స్వస్థ్య కార్యక్రమం అమలు తీరు

జిల్లాలో పది బృందాలు

గూడూరు-2, గార్ల-2, డోర్నకల్-2, మహబూబాబాద్-2, తొర్రూరు-2 చొప్పున మొత్తం 10 ఆర్‌బీఎస్‌కే బృందాలు న్నాయి. ఒక విద్యా సంవత్సరంలో ఒకసారి పాఠశాల, రెండు సార్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటారు.

జాతీయ ఆరోగ్య మిషన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆరోగ్య సేవలందేలా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)నకు పోస్టుల ఖాళీల బాధ వెంటాడుతోంది. ఈ బృందం జిల్లాలోని ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ సందర్శిస్తూ 0 నుంచి 18 ఏళ్ల వారికి అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలి. పిల్లల్లో స్వల్ప అనారోగ్య లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా ఉండేలా వీరు చేపడుతున్న స్క్రీనింగ్ పరీక్షలు తోడ్పడుతాయి. వైద్యాధికారుల పోస్టుల ఖాళీలతో సక్రమంగా సేవలందక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. వీరితోపాటు ఒక ఫార్మాసిస్టు పోస్టు సైతం ఖాళీగా ఉంది.

–డోర్నకల్, న్యూస్‌టుడే

ముందస్తు వ్యాధి నిర్ధారణే లక్ష్యం

పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, జబ్బులను సకాలంలో గుర్తించి ఆరోగ్యం మెరుగుపరచడం కార్యక్రమ లక్ష్యం. అనారోగ్య సమస్యలతో బాధపడే వారిలోని వ్యాధిని ముందస్తుగా గుర్తించి నిర్ధారించడంలో ఆర్‌బీఎస్‌కే కీలక పాత్ర పోషిస్తుంది. 4డీ...అంటే డిసీజ్, డిసార్డర్, డెవలప్‌మెంటల్ డిలేస్, డెఫిషియన్సీస్ ప్రాతిపదికన వీరు ముందుకు సాగుతున్నారు. రక్తహీనత, బాల్యంలో వచ్చే జబ్బులు, చర్మవ్యాధులను గుర్తిస్తారు. మందులను ఉచితంగా అందిస్తున్నారు. లోపముంటే డిస్ట్రిక్టు ఎర్లీఇంటర్వెన్షన్ సెంటర్‌కి తీసుకెళ్లి వైద్యం, అవసరమైనవారికి శస్త్ర చికిత్స చేయిస్తున్నారు. ఈ కేంద్రం జిల్లాలో లేనందున ఖమ్మం లేదా వరంగల్ తీసుకెళ్లాల్సి వస్తుంది.



డోర్నకల్ మండలం తెల్లబండతండా అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు

గ్రహణం మొర్రికి శస్త్ర చికిత్స

సీరోలు మండలం చిల్లోయలపాడు గ్రామానికి చెందిన ఈ చిన్నారి పేరు లిఖిత. వయసు రెండేళ్లు. ఆరు నెలల వయస్సు ఉన్నప్పుడు ఈ పాపకు గ్రహణం మొర్రి ఉందని గుర్తించారు. చికిత్సకు సిఫారసు చేశారు. బరువు తక్కువ ఉండటంతో శస్త్ర చికిత్స వాయిదా పడుతూ వచ్చింది. అవసరమైన పోషకాహారం అందించి రెండేళ్ల వయసులో డోర్నకల్ ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు ప్రియాంక ఈమెను అక్టోబరు 15న హైదరాబాద్ ఏవీర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్స చేయించారు.

తొమ్మిది వైద్యాధికారుల పోస్టులు ఖాళీ

ఒక్కో బృందంలో ఇద్దరు వైద్యులు ఒక ఏఎన్ఎం, ఒక ఫార్మాసిస్టు విధులను నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో పది బృందాలుండగా 40 మంది ఉద్యోగులు నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. తొమ్మిది వైద్యులు, ఒక ఫార్మాసిస్టు పోస్టు ఖాళీగా ఉంది. స్టేషనరీ బకాయిలు రాక అవస్థ పడుతున్నారు. పలు సమయాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనలో ఏఎన్ఎంలతోనే స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంటి బాధలతో సతమతం

జిల్లాలో 5-10 తరగతుల విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపారు. బాలురు 11182, బాలికలు 11325 మందిని పరీక్షించారు. వీరిలో బాలురు 250, బాలికలు 324 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. ఇతరత్రా సమస్యలు బాలుర 38, బాలికలు 25 మందిలో ఉన్నట్లు గుర్తించారు.



శనిగపురంలో కంటి పరీక్షలు

రక్తహీనతతో ఇబ్బంది

జిల్లాలోని 25150 మంది విద్యార్థుల్లో ఇప్పటిదాక 14,513 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో స్వల్ప రక్తహీనత-1723, ఒక మోస్తారు రక్తహీనత-721, అధిక రక్తహీనత-355తో ఇబ్బంది పడుతున్నట్లు తేల్చారు.

పోషకాహారం తప్పనిసరి

- డా.కుమార్, జిల్లా నోడల్ అధికారి, ఆర్‌బీఎస్‌కే



పిల్లలకు చిన్నప్పటి నుంచి అవసరమైన పోషకాహారం అందించాలి. శిబిరాలు జరిగిన చోట పోషకాహారం విలువల గురించి అవగాహన కల్పిస్తున్నాం. పిల్లల్లో ఎక్కువగా దంత, చర్మ, రక్తహీనత సమస్యలు కనిపించాయి. పోషకాహారం లోపం వల్లే ఈ తరహా అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



ప్రశంసాపత్రాలు పొందిన అధికారులు, సిబ్బందితో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. శుక్రవారం మహబూబాబాద్ రాణాలో పోలీసు అధికారులు, సిబ్బందితో నెలవారీ సమీక్ష నిర్వహించారు. అన్ని రకాలపై కేసుల స్థితిగతులపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 60 రోజుల్లో విచారణ పూర్తి చేసి వీలైనంత త్వరగా కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య డీఎస్పీలు తిరుపతిరావు, శ్రీనివాస్, సీఐలు సత్యనారాయణ, చంద్రమౌళి, నరేందర్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



చెరువులో వైకుంఠధామం..!

స్థల సేకరణలో జరిగిన లోటుపాట్లు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏకంగా చెరువు పరిధిలోనే వైకుంఠధామం నిర్మించారు. రూ.12.50 లక్షల వ్యయంతో 2020లో వైకుంఠధామాన్ని పుల్లూరు పెద్దచెరువు పరిధిలో ఉన్న చిన్నబంజరలో నిర్మించారు. ఏటా అతివృష్టి, వర్షాకాల సమయంలో జలదిగ్బంధంలో ఉంటోంది. దీంతో ఈ వైకుంఠధామం నిరుపయోగంగా మారింది.

– న్యూస్‌టుడే, గార్ల (మహబూబాబాద్)

మహిళా సంఘాల రుణాలు పక్కదారి!

మరిపెడ, న్యూస్‌టుడే: మహిళా సాధికారత కోసం మహిళా సంఘాలకు ప్రభుత్వం అనేక రకాల రుణసదుపాయం కల్పిస్తోంది. బ్యాంకు లింకేజీ ద్వారా పొదుపు సంఘానికి మంజూరయ్యే రుణాల నుంచి వడ్డీ లేకుండా సభ్యులు రుణాన్ని తీసుకోవచ్చు. పొదుపుసంఘం పరిధిలోని డివిజన్ సమాఖ్య, మండల సమాఖ్య, స్త్రీనిధి బ్యాంకు నుంచి రుణాలు పొందే అవకాశం ఉంది. రుణాల మంజూరు నిబంధనల్లోని లొసుగులు, రుణాలపై సభ్యులకు సంపూర్ణ అవగాహన లేకపోవడంతో కొంత మంది రిసోర్సు పర్సన్లు, సంఘాల ఆర్గనైజర్లు నిధులను దారి మళ్లిస్తూ స్వప్రయోజనాలకు వినియోగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో పలువురు సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలు తిరిగి చెల్లించినప్పటికీ బకాయి ఉన్నట్లు స్త్రీనిధి మేనేజర్ నోటీసులు జారీ చేశారు. ఆందోళనకు గురైన సభ్యులు గ్రామ సమాఖ్య ప్రతినిధులను నిలదీశారు. స్వయం కృషి వీవోలో రూ.19 లక్షలు స్త్రీనిధి బ్యాంకుకు బకాయి ఉండటంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. నాలుగు సంఘాలకు నోటీసులు జారీ చేయగా రెండు సంఘాల సభ్యులు మాత్రమే నోటీసులు తీసుకొన్నారు. తాము రుణ బకాయిలు చెల్లించామని ఎందుకు నోటీసులు జారీ చేస్తారని అధికారులను అడగడంతో విషయం బయటకు పొక్కింది. శ్రీరామ వీవోలో రూ.34 లక్షలు బకాయి ఉండగా రూ.17 లక్షలు సభ్యుల నుంచి వసూలు చేసిన అనంతరం స్త్రీనిధి బ్యాంకుకు చెల్లించాల్సి ఉండగా గ్రామ సంఘం సభ్యులకు తిరిగి అంతర్గత రుణాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా సిరి వీవోలో రూ.30 లక్షల బకాయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

విచారణ చేస్తున్నాం

- వెన్నెల, స్త్రీనిధి మేనేజర్

బకాయిలు ఎక్కువగా ఉండటంతో నోటీసులు జారీ చేయడంతో అవకతవకలు జరిగిన విషయం అర్థమవుతోంది. సమగ్ర విచారణ చేపట్టి నిబంధనల మేరకు సభ్యులు తిరిగి కట్టిన డబ్బుల వివరాలు సేకరిస్తాం. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలుంటాయి.

గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



వంటకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, న్యూస్‌టుడే: గురుకులాల్లో సౌకర్యాల మెరుగునకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, ప్రభుత్వ సంకల్పాన్ని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల, మైనార్టీ పాఠశాలలో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, వంట గదులు, తదితర సౌకర్యాల నిర్వహణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రామచంద్రయ్య, ఉపఛైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సోమరాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఐరీష్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్


మహబూబాబాద్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావివ్వకుండా నేరుగా రైతులు వచ్చి ధాన్యం విక్రయించేవిధంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఐరీష్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్ మాట్లాడుతూ వానాకాలం 2024-25 ధాన్యం కొనుగోళ్ల కోసం వివిధ శాఖల ద్వారా 234 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. సన్నరకం ధాన్యానికి రూ. 500 అదనంగా ఇవ్వనున్నట్లు వివరించారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం కృష్ణవేణి, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, డీసీవో వెంకటేశ్వర్లు, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులున్నారు.

రామప్ప.. సకల కళల సమ్మేళనం..!

వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణలో కొత్త ఆలోచనలకు స్వాగతం

యునెస్కో గుర్తింపు పొందిన కట్టడాల ప్రాముఖ్యాన్ని ప్రపంచస్థాయిలో మరింత ప్రచారం చేయడానికి యునెస్కో.. ఏటా వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. ఈనెల 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు రామప్పలో జరుగుతోంది. ఈ కార్యక్రమ నిర్వహణకు మే నెలలోనే దరఖాస్తులు స్వీకరించింది. 243 మంది దరఖాస్తు చేసుకోగా.. 40 మందిని ఎంపిక చేసింది. వీరితో పాటు యువ టూరిజం పేరుతో ఈ శిబిరానికి మరో 40 మందికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి అవకాశం కల్పించింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వాలంటీర్లతో మాట్లాడి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–వెంకటాపూర్, న్యూస్‌టుడే



మనకు గర్వకారణం.. రామప్ప ఆలయం.. 800 ఏళ్ల చరిత్ర. ఎన్నో ప్రకృతి విపత్తులను ఎదుర్కొని యునెస్కో గుర్తింపు పొంది ఓరుగల్లుకు గర్వకారణంగా నిలిచింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల పరిధిలోని ఈ రాతి కట్టడం నిర్మాణశైలి నేటి తరానికి ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తోంది. అయోధ్య రామమందిర పునాదిలో రామప్ప సాండ్‌బాక్స్ టెక్నాలజీ వాడారంటే ఆనాటి సాంకేతిక పరిజ్ఞానం ఎంత గొప్పదో తెలుస్తోంది..

కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన టూరిజం, చరిత్ర, ఆర్కియాలజీ, ఆర్కిటెక్చర్, కళలు, సివిల్ ఇంజినీరు విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు వాలంటీర్లుగా శిక్షణ పొందుతున్నారు.



శిక్షణ బృందం

కేరళ..

సామాజిక మాధ్యమాల్లో తెలుసుకుని..



కేరళ యూనివర్సిటీ ఆర్కియాలజీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న సంజయ్ మూడేళ్ల నుంచి కాలభైరవునిపై పరిశోధన చేస్తున్నారు. భారత దేశంలో ఉన్న ఆలయాలను స్వయంగా వెళ్లి చూడటం.. వాటి ప్రత్యేకతలు తెలుసుకోవడం ఆయనకు అభిలాష. సంజయ్ సందర్శించిన ఆలయాలు చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నవి కూడా ఉన్నాయి. వందల ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉండి, ఆనాడే అద్భుత సాంకేతికతను వాడడం, తెలుగు రాష్ట్రాల నుంచి యునెస్కో గుర్తింపు పొందిన ఏకైక కట్టడం రామప్ప అని సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్నారు. వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణకు దరఖాస్తు చేసుకుని ఎంపికయ్యారు.

● రామప్పకు చేరుకోగానే శిలాశాసనం, చరిత్ర గురించి ఆరా తీశారు. ఆయన పరిశీలించిన ఆలయాల్లో రామప్పకు గొప్ప ప్రత్యేకత ఉందని, వాడిన సాంకేతిక పరిజ్ఞానం మరెన్నో కట్టడాల పునర్నిర్మాణానికి ఉపయోగకరంగా ఉందని ఇతరులకు తెలియజేయడానికి నిత్యం సామాజిక మాధ్యమాల ద్వారా చర్చిస్తున్నారు.

తమిళనాడు

సదస్సులకు వెళ్తూ.. స్వయంగా పరిశీలిస్తూ



టీఎన్ఎస్‌డీఏ పీజీ డిప్లొమాలో ఇంజినీరింగ్ చేస్తున్న విజయరాజ్‌ది తమిళనాడు. దేశవ్యాప్తంగా వారసత్వ కట్టడాలకు సంబంధించిన సదస్సులకు హాజరవ్వడం మక్కువ. ఫేస్‌బుక్‌లో చూసిన పోస్టును ఆధారం చేస్తుకుని వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3కి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ పాండురంగారావు సూచనల మేరకు తమిళనాడు నుంచి తన నలుగురు మిత్రులతో కలిసి రామప్పకు వచ్చారు.

● కాకతీయులు నిర్మించిన ఆలయాల ప్రత్యేకత గురించి శిబిరంలో నేర్చుకుంటున్నారు. ప్రొఫెసర్లు వివరించే తీరు, ప్రత్యక్షంగా చూపించే పద్ధతి ఎంతో ఉపయోగకరంగా ఉందంటూ చెప్పారు. శిక్షణలో కొత్త ఆలోచనలు పంచుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్

ప్రకృతి ప్రతిరూపమే.. పర్యాటకం



ప్రకృతి రూపమైన పర్యాటకాన్ని ప్రపంచ నలుమూలలా చాటేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన జ్ఞానకళ బీబీఏ టూరిజం విభాగంలో పరిశోధనలు చేస్తున్నారు. లెజర్ టూరిజం, అడ్వెంచర్, ఫుడ్స్, గుళ్లగోపురాలకు సంబంధించిన పర్యాటక మెలకువలను నేర్చుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు.

● పర్యాటక ప్రదేశాలకు వెళ్లిరావడం కాదని, అక్కడ చూసిన, తెలుసుకున్న విషయాలపై అవగాహన పెంచుకొని పలువురికి తెలియజేయాలని వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికలుగా వేలాది మందికి అవగాహన కల్పిస్తున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన బృందాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రామప్ప అద్భుత శిల్పాల గురించి ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారు..

తెలంగాణ

టూరిజం క్లబ్‌లో స్థానం దక్కించుకుని..



చరిత్రను అభ్యసించేవారు తగ్గిపోతున్న ఈ రోజుల్లో వరంగల్ పింగిళి కళాశాల హిస్టరీ ప్రొఫెసర్ శ్రీనివాస్ ప్రోత్సాహంతో స్వప్న బీఏ(చరిత్ర) చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టూరిజం క్లబ్(యువటూరిజం)లో స్థానం దక్కించుకుని వాలంటీర్ శిక్షణకు ఎంపికయ్యారు.

● కాకతీయ కట్టడాల చరిత్ర అంటే అంతా ఒకేలా ఉంటుందని అనుకున్న ఆమె రామప్పకు చేరుకున్న తర్వాత ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, పొన్న చెట్టుపై ఉన్న శ్రీకృష్ణుడు సత్యభామ చీర లాగడం, శిల్పాలను మీటితే సరిగమపదనిసలు రావడం, క్షీరసాగరమథనం, శివపార్వతుల కళ్యాణం, నరకాసురవధ లాంటి పురాణ హితిహాసగాథలు, భూకంపాలను తట్టుకునే విధంగా కట్టిన ఆలయ నిర్మాణాన్ని చూసి అబ్బురపడిపోయారు. దేశంలోని చరిత్రలకే కాకతీయుల చరిత్ర పునాదిగా నిలిచిందంటున్నారు.



హనుమకొండ జిల్లాలోని ఓ క్వారీలో తవ్వకాలు

ఇక్కడా ఉన్నారు ఘనులు

● కరుగుతున్న గుట్టలు.. తరలుతున్న మొరం

'ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా గనుల తవ్వకాల కోసం అనుమతులు పొందినవి 1,276 కాగా, అక్రమంగా తవ్వకాలు చేపట్టేవి 430కి పైగా ఉన్నట్లు గుర్తించారు.'

గనుల మేతలో ఆరితేరిన లీజుదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నాయి. జనగామ జిల్లా మైనింగ్ శాఖ ఏడీ విజయకుమార్ ఇటీవల సస్పెండ్ అయ్యారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసినప్పుడు స్థిరాస్తి వ్యాపారులకు సహకరించి అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ జరిపి ప్రభుత్వం ఆమేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాలోనూ గ్రానైట్, మట్టి తవ్వకాల్లో రూ.కోట్లల్లో అక్రమాలు జరిగింది. ఇక్కడ సైతం పూర్తిస్థాయిలో విచారణ చేపడితే అవినీతి అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

–ఐనవోలు (హనుమకొండ), న్యూస్‌టుడే

'వరంగల్ గ్రానైట్‌ను దేశంలోని అనేక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. క్వారీల నుంచి బ్లాక్, టాన్ బ్రౌన్, టాన్ రెడ్, టాన్ బ్లూ గ్రానైట్ అధికంగా లభిస్తుంది.'

టాస్క్‌ఫోర్స్

ప్రభుత్వ ఆదేశాలతో విచారణ జరిపిన అధికారులు గనుల తవ్వకాల్లో భారీగా సీనరేజి ఎగవేత జరిగిందని గుర్తించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో లీజుదారులకు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సైతం 80 మందికిపైగా లీజుదారులకు నోటీసులు అందజేసి జరిమానా విధించారు. దీంతో కొంతమంది క్వారీలు మూసివేశారు.

పంట పొలాలు.. వెంచర్లుగా: స్థిరాస్తి వ్యాపారం సజావుగా కొనసాగాలంటే అనుమతులతో పాటు భూమి చదునుగా ఉండటం ముఖ్యం. ఇందుకు ప్రధానంగా మొరం అత్యంత అవసరం. గ్రేటర్ వరంగల్ నగరం చుట్టూ ధర్మసాగర్, ఆత్మకూరు, ఐనవోలు, దామెర, హసన్‌పర్తి మండలాల్లో 109 గ్రానైట్, మొరం క్వారీలు ఉన్నాయి. ఇందులోని మొరాన్ని స్థిరాస్తి వ్యాపారానికి వినియోగిస్తున్నారు. అధికారులు ఇచ్చే అరకొర అనుమతులతో గ్రానైట్, మట్టి, ఇసుక తవ్వకాల్లో అనుమతులకు భిన్నంగా లీజుదారులు తోడేస్తున్నారు. నగరానికి వేలాది టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. అధికారులు, లీజుదారులు, వ్యాపారులు కుమ్మక్కై చేతివాటం చూపడంతో వేలాది వ్యవసాయ భూములు వెంచర్లుగా వెలుస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

● కాజీపేట నుంచి వరంగల్ వెళ్లే బైపాస్ ప్రధాన మార్గం భట్టుపల్లి రెవెన్యూ పరిధిలో రహదారికి ఆనుకొని ఉన్న 18 ఎకరాల భూమి రోడ్డుకు 10 ఫీట్ల లోతులో ఉండేది. ఆ భూమికి ఎదురుగా ఓ కార్పొరేట్ పాఠశాల, కళాశాల ఏర్పాటు చేయగా ఆ ప్రాంత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. లోతట్టులో ఉన్న భూమిని రహదారికి సమాంతరంగా చేయాలని ఆ భూమి యజమాని భావించారు. గత పాలకులు, అధికారుల సహకారంతో కొండపర్తి, వనమాలకనపర్తి, తరాలపల్లి క్వారీల నుంచి 4 వేలకుపైగా టిప్పర్ల ద్వారా 80 వేల మెట్రిక్ టన్నుల మొరం తరలించి రోడ్డుకు సమాంతరంగా భూమిని చదును చేశారు.

● హైదరాబాద్ -వరంగల్ జాతీయ ప్రధాన రహదారిలో రాంపూర్ రెవెన్యూ పరిధిలో అనుమతులు తీసుకుని 30 ఎకరాల్లో ఏర్పాటు చేసి ఓ లేఅవుట్, వరంగల్-ఖమ్మం జాతీయ ప్రధాన రహదారిలో పున్నేలు రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్, దేవన్నపేట, మడిపల్లి రెవెన్యూ పరిధిలో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్ల భూముల్లోకి వేలాది టిప్పర్ల ద్వారా మొరం తరలించారు. మొత్తంగా రూ.8 కోట్లకు పైగా మొరం తరలింపులో అధికారుల పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ధర్మసాగర్ మీదుగానే గూడ్స్ లైన్ బైపాస్

● నష్కల్ నుంచి చింతలపల్లికి మరోటి

కాజీపేట, న్యూస్‌టుడే: హసన్‌పర్తి రోడ్డు నుంచి ధర్మసాగర్ మీదుగా నష్కల్ వరకు గూడ్సు బైపాస్ లైను నిర్మాణానికి రైల్వే శాఖ అడుగులు వేస్తోంది. తాజాగా ఈ మార్గంలో 24.55 కి.మీటర్ల మేర భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ధర్మసాగర్ రైతులు బైపాస్ లైను మార్గం మార్చాలని కోరుతున్నారు. ముందుగా పెండ్యాల నుంచి 163వ జాతీయ రహదారి పక్కనుంచి లైన్‌ను ప్రతిపాదించారు. తర్వాత బైపాస్ మార్గాన్ని మార్చుతూ రైల్వే నిర్ణయం తీసుకుంది. కొందరు పెద్దల ఒత్తిడే దీనికి కారణమంటూ ధర్మసాగర్ రైతులు ఆరోపిస్తున్నా.. రైల్వే శాఖ ధర్మసాగర్ మీదుగానే బైపాస్ నిర్మాణానికి సిద్ధమైంది. భూసేకరణ కోసం జనగామ, హనుమకొండ జిల్లాల్లోని ధర్మసాగర్, హసన్‌పర్తి, చిల్పూర్ రెవెన్యూ అధికారులకు నోటిఫికేషన్ అందించింది. దీంతో పాటు నష్కల్ నుంచి మామునూరు మీదుగా గీసుకొండ మండలం చింతల్ రైల్వే స్టేషన్ వరకు మరో బైపాస్‌ను ప్రతిపాదించింది. గూడ్సురైళ్లను బైపాస్‌ల మీదుగా పంపించి కాజీపేట, వరంగల్ స్టేషన్లలో ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు సుగమం చేయడానికి ఈ రెండు మార్గాలను ప్రతిపాదించింది. బల్లార్షా- కాజీపేట మార్గంలో గూడ్సు రైళ్ల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండటం వల్ల ఈ మార్గంలో ముందస్తుగా నిర్మాణం చేయాలని భావిస్తోంది.

వంతెన నిర్మాణానికి ప్రణాళిక.. : హసన్‌పర్తి రోడ్డు - నష్కల్ స్టేషన్ల మధ్య నిర్మించే బైపాస్ లైన్ నష్కల్ లేదా పెండ్యాల వద్ద 163వ జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సి ఉంటుంది. అలాగే బైపాస్ వల్ల ఎక్కువగా ధర్మసాగర్ గ్రామస్థులు, రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. అందుకని ఈ రెండు చోట్ల వంతెనల నిర్మాణం కోసం రైల్వే అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



రైల్వే శాఖ విడుదల చేసిన రూట్‌మ్యాప్

చికెన్ ధరలు

(కిలో ధర రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు అన్ని కులాల వధూవరులకు 'ఈనాడు' పెళ్లిపందిరి. నెట్ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



జనగామ, న్యూస్‌టుడే: తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు' పెళ్లిపందిరి.నెట్ అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జనగామలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులతో పాటు, సంబంధిత కుటుంబీకులు నేడు అనగా శనివారం(19 అక్టోబరు 2024) మరియు ఆదివారం (20 అక్టోబరు 2024) నాడు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు దిగువన పేర్కొన్న వాట్సప్ ఫోన్ నెంబర్లకు పంపవచ్చు. మరిన్ని వివరాలకు 8314445190, 8008002165 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.



సమస్యలు బోలెడు.. కొత్త వీసీపై ఆశలు

కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా నియమితులైన విశ్రాంత ఆచార్యులు కర్నాటి ప్రతాప్‌రెడ్డికి ఇక్కడి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇటు విద్యార్థులు, అటు ఆచార్యులు, అధ్యాపకులు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యానగర్, కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే

వేతనాలకే చాలని నిధులు..

ఉత్తర తెలంగాణలో విద్యా కేంద్రంగా విరాజిల్లుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ పని చేస్తున్న వెయ్యి మంది బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలకు ఏడాదికి రూ.150 కోట్లు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ కింద వస్తున్న రూ.97 కోట్లు వేతనాలకు సరిపోక.. ఏటా రూ.53 కోట్ల నిధులు అంతర్గత సమీకరణల ద్వారా సమకూర్చుకుంటున్నారు. నిధులు లేక అభివృద్ధి అటకెక్కింది. తక్షణం నిధుల సేకరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనలను ప్రగతి పథంలో పరుగులు పెట్టించాలంటే అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకం. వర్సిటీలో ప్రస్తుతం బోధన అంతా ఒప్పంద, తాత్కాలిక అధ్యాపకులతోనే సాగిస్తున్నారు. మొత్తం 405 రెగ్యులర్ అధ్యాపక పోస్టులు ఉండగా.. అందులో 83 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 190 మంది ఒప్పంద, 201 మంది తాత్కాలిక అధ్యాపకులు బోధిస్తున్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన కోర్సులతో కలిపి సుమారు వెయ్యి మంది వరకు అధ్యాపకులు ఉండాలి. వారి నియామకాలే పెద్ద సమస్యగా మారింది.



నిధులు లేక నిరుపయోగంగా ఉన్న కె-హబ్

మరిన్ని..

- విశ్వవిద్యాలయంలో మొత్తం 14 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బాలురకు సరిపడా ఉన్నా.. బాలికలకు వసతి కొరత ఉంది.
- కబ్జాకు గురైన కేయూ భూములను స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. మిగతా స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మాణం అవసరం.
- పీహెచ్‌డీ ప్రవేశాలపై కొనసాగుతున్న వివాదం

15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి



విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిగా కర్నాటి ప్రతాప్‌రెడ్డి రానున్నారు. ఆయనకు 32 సంవత్సరాలకు పైగా బోధన, 37 సంవత్సరాల పరిశోధన అనుభవం ఉంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా పనిచేసి 2021లో ఉద్యోగ విరమణ పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వ్యక్తిపరంగా 13వ, పదవీ కాలం పరంగా చూస్తే 15వ ఉప కులపతి అవుతున్నారు. గతంలో ఆచార్య జాఫర్ నిజాం, ఆచార్య టి.వాసుదేవ్ రెండుసార్లు వీసీగా పని చేశారు. ఆచార్య టి.రమేశ్ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 21న ముగిశాక ఇప్పుడు రెగ్యులర్ వీసీ నియామకం అయ్యారు.

ఇదీ ప్రస్థానం

● కర్నాటి ప్రతాప్‌రెడ్డిది రంగారెడ్డి జిల్లా యాచారం. 1981లో బీఎస్సీ (హానర్స్) జంతుశాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా పొందారు. అదే విశ్వవిద్యాలయం నుంచి 1983లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ నుంచి పీజీ పట్టా తీసుకున్నారు. 1988లో జంతుశాస్త్రం, న్యూరోబయాలజీ లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు.. ముఖ్యంగా

● 2016 నుంచి 2018 వరకు జంతుశాస్త్ర విభాగాధిపతిగా, 2018 నుంచి 2020 వరకు విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, 2020 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సైన్స్ డీన్‌గా సమర్థంగా పనిచేశారు. 2021లో ఉద్యోగ విరమణ చేశారు. తన ఉద్యోగ ప్రస్థానంలో 104 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ప్రచురించారు. 87 జాతీయ, అంతర్జాతీయ పరిశోధన, ప్రదర్శనలు చేశారు. 10 ప్రాజెక్టులు పూర్తి చేశారు. 7 పుస్తకాలను రచించారు. 25 మందికి పరిశోధన పర్యవేక్షకుడిగా పని చేశారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడల్లోంచి బంగారు గొలుసులు అపహరిస్తున్న దొంగను అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణ ఠాణా సమావేశ మందిరంలో ఆయన నిందితుడి గురించి తెలిపిన వివరాలు ఇవి.. మానుకోటలో కొద్ది రోజుల నుంచి గొలుసు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య పర్యవేక్షణలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈమేరకు పోలీసులు పట్టణంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఇల్లందు రోడ్డులో ద్విచక్రవాహనంపై బయ్యారం వైపు నుంచి వస్తున్న ఆంగోతు విక్రమ్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంబడించి అదుపులోకి తీసుకొని విచారించారు. 2013 వరకు విక్రమ్ తన తల్లిదండ్రులతో ఖమ్మంలో ఉండేవాడు. అనంతరం బయ్యారంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. డిగ్రీ చదువుతూ చరవాణి ద్వారా ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడి డబ్బులు పోగొట్టుకొన్నాడు. ఆ సొమ్ము సంపాదించడం కోసం సామాజిక మాధ్యమంలో గొలుసు దొంగతనాలు ఎలా చేస్తారనే విషయాన్ని పరిశీలించాడు. ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడల్లోంచి బంగారు ఆభరణాలు అపహరించడం ప్రారంభించాడు. ఆ సమయంలో ఎవరూ గుర్తు పట్టకుండా ద్విచక్రవాహనం నెంబర్ ప్లేటు మార్చి ముఖానికి మాస్కు ధరించేవాడు. మహబూబాబాద్ పట్టణం కృష్ణాకాలనీ, కంకరబోడ్ కాలనీ ఒకటి చొప్పున, బ్యాంక్ కాలనీలో రెండు, ఖమ్మం ప్రాంతంలో ఏడు గొలుసు దొంగతనాలకు పాల్పడ్డాడు. అపహరించిన సొత్తును విక్రయించేందుకు మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో అతనిని పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. 20.9 తులాల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం, ఒక చరవాణి స్వాధీనం చేసుకున్నారు. మరో 33 గ్రాముల బంగారం వస్తువులు ప్రైవేటు సంస్థలో తాకట్టు పెట్టాడన్నారు. నిందితుడిపై పీడీ చట్టం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న మహబూబాబాద్ పట్టణ సీఐ పెండ్యాల దేవేందర్, సీసీఎస్ సీఐ హతీరాం, ఎస్సైలు తహెర్‌బాబా, బి.గోపి, బి.విజయ్‌కుమార్‌తోపాటు సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు తదితరులున్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో ప్రధానాచార్యుడు ఉపేందర్, ఉపాధ్యాయులు

ప్రతిభకు పదును..!

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా 'ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమ ప్రభావం' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8,9,10వ తరగతుల విద్యార్థినీ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదోతరగతి విద్యార్థిని జి.కావ్య ప్రథమ, ఘనశ్యాం ద్వితీయ, 9వ తరగతి విద్యార్థి రాధాకృష్ణ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రధానాచార్యులు ఉపేందర్ బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు టి.నాగేశ్వర్‌రావు, వై.యాకూబ్ పాషా, వి.వెంకటేశ్వర్‌రావు, పి.ఉపేందర్ తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499, డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: బ్యాంకుకాలనీ నుంచి సిగ్నల్‌కాలనీ వెళ్లే రహదారిలో పైపులైను గేట్‌వాల్వ్ లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోవడంతో పాటు కలుషితమవుతోంది. **- పిట్టల శేఖర్**

సమాధానం: రెండు రోజుల్లో మరమ్మతు చేయిస్తాం. **- తోట రాజేష్, మున్సిపల్ శానిటరీఇన్‌స్పెక్టర్.**

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: జ్యోతిబసునగర్‌కాలనీ మురుగునీటి కాల్వలను శుభ్రం చేయడం లేదు. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **సాగర్ కట్ట**

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. **తోట రాజేష్, మున్సిపల్ శానిటరీఇన్‌స్పెక్టర్.**

పిచ్చి మొక్కల తొలగింపు

స్పందనకు వందనం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కాకతీయనగర్ కాలనీ ఐబీసీ చర్చి ప్రధానవీధిలో ఆవరణలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని ఈ నెల 11న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీఇన్‌స్పెక్టర్ తోట రాజేష్ స్పందించారు. జేసీబీ సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వొద్దు


కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహం, గిరిజన బాలుర వసతి గృహంలో తనిఖీలు చేశారు. విద్యార్థులను సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామారావు ఉన్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు సరికాదు'

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌పై మహబూబాబాద్ బ్లాక్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డితో పాటు మరికొందరు నేతలు అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని మహబూబాబాద్ బ్లాక్ మాజీ అధ్యక్షుడు ఎన్.సత్యపాల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు జి.బాలాజీనాయక్, మాజీ వైస్‌ఎంపీపీ జె.వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల నియామకంలో ఎమ్మెల్యే మురళీనాయక్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని, మండలంలో నిర్వహించే కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదంటూ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మండల అధ్యక్షుడు ప్రభాకర్ సమక్షంలో ప్రతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కొందరు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నేతలు పి.నాగరాజు, యాకసాయిలు, వెంకట్‌రెడ్డి, దేవేందర్‌రావు, రాజేష్, వెంకన్న, రాజు, ఉప్పలయ్య, హన్మంతు, శ్రీనివాస్, గౌస్, సతీష్, నరేందర్, మౌనేందర్, మల్లేశం, హన్మంతు, పాల్గొన్నారు.

నెల్లికుదురు, న్యూస్‌టుడే: గిరిజనుడైన మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను అవమానిస్తూ ఆరోపణలు చేయడం సరికాదని లంబాడ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు దేవేందర్ అన్నారు. నెల్లికుదురులో శుక్రవారం ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ గిరిజన ఎమ్మెల్యే మురళీనాయక్‌ను దూషించిన, అవమానించిన గిరిజనుల సత్తా చూపిస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ జి.శంకర్, బాలాజీనాయక్, వెంకన్న, రమేష్, బోజ్యా, లింగ్యా, భాస్కర్, రాజు, కిషన్ తదితరులున్నారు.

తొర్రూరు డివిజన్

ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటుపై అభ్యంతరం


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారాస నాయకులు

తొర్రూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటులో అధికార పార్టీ నాయకులు నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా కమిటీలు చేస్తున్నారని, దీనిపై విచారణ, గ్రామ సభలు నిర్వహించి ఎంపిక చేయాలని తొర్రూరు మండల భారాస మండలాధ్యక్షుడు సీతారాములు, జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌లు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, ప్రమోదు, శ్రీనివాస్, ప్రదీప్‌రెడ్డి, జనార్దన్‌రాజు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి


సభ్యత్వ నమోదు చూపుతున్న ఉపాధ్యాయులు

తొర్రూరు, న్యూస్‌టుడే: ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం శుక్రవారం పలు బడుల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్నా డీఏలు విడుదల చేయకపోవడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సంఘం బాధ్యులు చంద్రమౌళి, ప్రభాకర్‌రావు, చంద్రప్రకాశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తక్షణమే తరలించాలి


ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తొర్రూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయం పార్కింగ్ స్థలంలో అబ్కారీ శాఖ పట్టుకున్న వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయడంతో పాఠకులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అశోక్ తెలిపారు. శుక్రవారం పార్టీ పట్టణ కార్యదర్శి యాకయ్య ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్‌కు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పెద్దవంగర, న్యూస్‌టుడే: పెద్దవంగర మండలానికి మంజూరైన 24 కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శుక్రవారం తన క్యాపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ ఫలాలను ప్రతి గడపకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముద్దసాని సురేష్, నేతలు వెంకన్న, సమ్మయ్య, వేణు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో కేంద్రప్రభుత్వం విఫలం'



సమావేశంలో మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

కేసముద్రం, న్యూస్‌టుడే: మతోన్మాదం దేశాభివృద్ధికి గొడ్డలి పెట్టులా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. కేసముద్రంలోని వేడుకల మందిరంలో శుక్రవారం మండల సీపీఎం 6వ మహాసభ చాగంటి కిషన్, గొడిశాల వెంకన్న వేల్పుగొండ సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునుగంటి రాజన్న, సూరపు సోమయ్య, ఆకుల రాజు, అలువాల వీరయ్య, పుట్ట ముత్తయ్య, మార్తినేని పాపారావు, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, మోడెం వెంకటేశ్వర్లు, కావటి నర్సయ్య, తాడబోయిన శ్రీశైలం, జల్లె జయరాజు తదితరులున్నారు.

హనుమంత వాహనసేవ



గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెం సమీపంలోని వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణం అనంతరం హనమంత వాహనసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గూడూరు బస్టాండ్ అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ రూరల్ (గూడూరు) న్యూస్‌టుడే: గూడూరులోని ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బస్టాండును పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడి గూడూరు బస్టాండ్ గురించి వివరించారు. అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి స్వామి, సీనియర్ నాయకులు మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, యాకూబ్‌పాషా, మల్లేష్ తదితరులున్నారు.

పిడుగు పాటుతో మహిళ దుర్మరణం

డోర్నకల్, న్యూస్‌టుడే: పిడుగు పాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన సీరోలు మండలం అందనాలపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పోతురాజు వెంకమ్మ అలియాస్ వెంకట్‌లక్ష్మీ (46) పొలం పనుల నిమిత్తం చేనుకు వెళ్లింది. ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో చెట్టు కిందకు పరుగులు తీస్తుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. చుట్టు పక్కల ఉన్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

వేధింపుల కేసులో ఇద్దరి అరెస్టు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: పోక్సో కేసులో బాధ్యులైన ఇద్దరిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన బాలికను ఇద్దరు యువకులు వేధింపులకు గురి చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం ఠాణా సమీపంలో శుక్రవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కాట్రపల్లి గ్రామానికి చెందిన గుండ్ల శ్రీనివాస్ కేసముద్రం(వి) గ్రామం వైపు వెళ్తున్నారు. కోరుకొండపల్లి గ్రామానికి చెందిన నర్సింగోజు శంకర్ కేసముద్రం వెళ్తుండగా పోలీసు స్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరిని 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన దంతాలపల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం... బుర్ర ముత్త అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచారు. శుక్రవారం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరుస చోరీలతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

యువకుడి ఆకస్మిక మృతి

బయ్యారం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ దైవదర్శనానికి వచ్చిన ఓ యువకుడు అకస్మాత్తుగా మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరా మేరకు.. మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి గ్రామానికి చెందిన కుండికంటి రాములు(30) గంధంపల్లి సమీపంలోని సమ్మక్క, సారలమ్మల గుడికి దర్శనం కోసం తల్లి సావిత్రితో కలిసి వచ్చారు. దేవుడి దర్శనం అనంతరం అక్కడ ఉన్న పూజరిని కలిసిన రాములు తన ఆరోగ్య పరిస్థితిని వివరించారు. ఈక్రమంలోనే పూజకు అవసరమైన సామగ్రి తెచ్చుకునే సమయంలోనే రాములు అకస్మాత్తుగా అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. కళ్లముందే కన్న కొడుకు అకస్మాత్తుగా మృతిచెందడంతో తల్లి సావిత్రి కన్నీటిపర్వంతమయ్యారు. విషయం తమ కుటుంబసభ్యులకు తెలపడంతో మృతదేహాన్ని జమాండ్లపల్లి తరలించారు.

సంక్షిప్తంగా

గిరిజన పట్టభద్రులకు ఉచిత శిక్షణ

కొత్తగూడ, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని డిగ్రీ పూర్తిచేసిన గిరిజన నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నవంబర్ 3న స్క్రీనింగ్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు గ్రూప్స్, పోలీస్, బ్యాంకింగ్, రైల్వే, తదితర ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన ఫౌండేషన్ శిక్షణను రెసిడెన్షియల్ పద్ధతిన ఇస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 83744 17424, 94410 03400 నంబర్లకు ఫోన్‌చేసి తెలుసుకోవాలని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి



బయ్యారం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంత రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టి మోసం చేసిన వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీలోని రైతుల అమాయకత్వాన్ని ఆసరాచేసుకొని వ్యాపారులు మొక్కజొన్న, వరి, పత్తి నకిలీ విత్తనాలను విక్రయించారని ఆరోపించారు. పంట ఏపుగా పెరిగినా దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.

అధిక సాంద్రత విధానంతో మేలైన దిగుబడి

మానుకోట, న్యూస్‌టుడే: అధిక సాంద్రత విధాన పత్తి సాగుతో మేలైన దిగుబడులు సాధించవచ్చని మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. శుక్రవారం మండలంలోని చంద్రుతండాలో అధిక సాంద్రత పత్తి సాగుపై కేవీకే ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ పత్తి సాగు విధానంలో ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లు దిగుబడులు వస్తే అధిక సాంద్రత పద్ధతిలో 10 నుంచి 12 క్వింటాళ్లు సాధించవచ్చన్నారు. ఈ విధానంలో పత్తి పంట కాలం డిసెంబర్ మొదటి వారం లోపు పూర్తవుతుందన్నారు. ఏకకాలంలో చేతికి వస్తుందన్నారు. ఈ విధానంలో పత్తిసాగు చేసిన రైతు బాలాజీ, కేవీకే శాస్త్రవేత్తలు ఎన్.కిశోర్‌కుమార్, బి.క్రాంతికుమార్, రాజిరెడ్డి, సంతోశ్, రాశి కంపెనీ ప్రతినిధులున్నారు.

నియామకం



కొత్తగూడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా నామోజు కృష్ణ ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ వీరేందర్ శుక్రవారం కొత్తగూడలో ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పాకాల స్వామి ఎన్నికైనట్లు పేర్కొన్నారు. వీరికి నియామక పత్రాలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, చల్లా నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మొగిలి అందజేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

గార్ల, న్యూస్‌టుడే: మహిళలు పురుషులతో సమానంగా స్త్రీనిధి రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రాంతీయ మేనేజరు మధుసూదన్ పిలుపు నిచ్చారు. జీవంజిపల్లిలో శుక్రవారం స్త్రీనిధి సమావేశం జరిగింది. 2018లో రుణాలు తీసుకొని రూ.లక్షకు పైగా బకాయిలు ఉన్న మూడు గ్రూపులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సహకార చట్టం ప్రకారం వారం రోజులులోగా బకాయిలను చెల్లించనివారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మేనేజరు మారుతి, సీసీ లక్‌పతి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉర్సు

మహబూబాబాద్: మహబూబాబాద్ పురపాలక సంఘం పరిధిలోని బేతోలులో శుక్రవారం హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా వద్ద ఘనంగా ఉర్సు నిర్వహించారు. జెండాను ప్రధాన వీధుల్లో ఊరేగించి ఉర్సుగుట్టపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు, ఖందిల్ కమిటీ సభ్యులు షేక్ యూసుఫ్, మస్తాన్, జబ్బార్‌మియా, జావిద్, పాషా, షరీఫ్, ఇమాం పాల్గొన్నారు.

గోడ పత్రికల ఆవిష్కరణ

కురవి, న్యూస్‌టుడే: వరంగల్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న మెగా గర్జన సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బానోతు దేవేందర్ అన్నారు. శుక్రవారం ఆయన కురవి జడ్పీ ఉన్నత పాఠశాలలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. నాయకులు ప్రవీణ్, లోకేశ్, ప్రకాశ్, అంజలి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలకు ఎంపిక

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని మునిగలవీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఇసంపల్లి పవన్ రాష్ట్రస్థాయి సాంస్కృతికి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న తెలిపారు. ఆమె శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడారు. ఈ నెల 17న మహబూబాబాద్ నిర్వహించిన కళాఉత్సవ్ కార్యక్రమం భాగంగా నిర్వహించిన పాటలు, డప్పు వాయిద్య కళలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు



దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కొండ యాకయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏను రెండున్నరేళ్ల నుంచి ఇవ్వడం లేదన్నారు. జులై 2023 నుంచి పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వంశీ, సంఘం బాధ్యులు విజయ్‌కుమార్, పార్వతి, చిరంజీవి, రామారావు, రమేష్ ఉన్నారు.

నారాయణ జీవితం అందరికీ స్ఫూర్తి

కురవి: నున్న నారాయణను స్ఫూర్తిగా తీసుకుని కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఎం మండల నాయకుడు నల్లపు సుధాకర్ అన్నారు. శుక్రవారం కురవి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నున్న వర్ధంతిని నిర్వహించారు. నారాయణ పేదల కోసం అనేక ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, కిషన్‌నాయక్, వెంకన్న, కృష్ణయ్య, దేవ, జ్యోతిబాస్ పాల్గొన్నారు.

పేద ప్రజల పక్షాన పోరాటం

మహబూబాబాద్: పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నున్న నారాయణ తన జీవితాంతం వరకు నిరంతరం పోరాటం చేశారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజమౌళి పేర్కొన్నారు. నారాయణ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని నున్న నారాయణనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు మచ్చ వెంకన్న, ముస్తఫా, వెంకటమ్మ, మధు, మంగమ్మ, ఐలమ్మ, భాగ్యమ్మ,ధర్మయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


హోమం చేస్తున్న స్థానికులు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: బీరిశెట్టిగూడెం శివారు పంతులుతండాలో శ్రీ రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణానికి తండావాసులు శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. శంకుస్థాపన సందర్భంగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో జగన్, రాము, సైదులు, కిష్టు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



మానుకోట, (గూడూరు) న్యూస్‌టుడే: తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరు మండలం తీగలవేణి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతోనే వీటిని పంపిణీ చేసినట్లు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ బాధ్యుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌ఏ ఫారూఖ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభించిన ఎంఈవో ఎం.వీరభద్రరావు

గార్ల, న్యూస్‌టుడే: ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలస్థాయి గ్రామీణ కబడ్డీ పోటీలను మర్రిగూడెంలోని వేంకటేశ్వర క్రీడామైదానంలో ఎంఈవో మంకిడి వీరభద్రరావు శుక్రవారం ప్రారంభించారు. జాంకీరాజ్ స్మారక 32వ వార్షికోత్సవ పోటీల్లో కబడ్డీ, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలను నిర్వహిస్తున్నారు. తొలుత స్నేహపూర్వక కబడ్డీ పోటీని ప్రారంభించారు. బీవైఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కస్నానాయక్, హెచ్‌ఎం రామచంద్రు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు, న్యాయవాది హరినాయక్, మాజీ ప్రజాప్రతినిధులు లాలూనాయక్, మల్లిబాబు, సురేష్, భీముడు, శాంతికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.